# ఒప్పందం

"అమ్మ రేపొద్దున రైల్లో ఇక్కడకు వస్తోంది విజయవాడనుండి" తను ఎంతో శ్రద్ధగా తయారు చేసిన నూడుల్స్ రెండు గాజు పళ్ళేలలోకి స్పూన్‌తో వేస్తూ చెప్పాడు సౌరభ్.

సన్నగా తరిగిన కాబేజి, కాప్సికమ్, బీన్స్, క్యారెట్ ముక్కలతో అందంగా, కలర్‌ఫుల్‌గా కనబడుతున్న నూడుల్స్‌ను ఇష్టంగా చూస్తూ, "ఈ డిష్ తయారు చేయడంలో స్పెషలిస్ట్ అయిపోయినట్టున్నావు." అంది అభినందనగా చూస్తూ శర్మద. తన మాటలు ఆమె వినిందని అతనికి తెలుసు అలా రాత్రి భోజనం ముగించాక, టేబులు శుభ్రంగా తుడిచేసింది. వంటిల్లు, డ్రాయింగ్‌రూము, బాల్కనీ అన్నీ తిరిగి తనకు సంబంధించిన వస్తువులేవీ లేకుండా తీసి తన గదిలో పెట్టుకుంది.

చిన్న సంచీలో తనకు రెండు రోజులకు కావలసిన బట్టలు, బ్రష్ పేస్ట్, సోపులాంటివి సర్దుకుని ఎనిమిది గంటల కల్లా వెళ్ళడానికి సిద్ధమయింది.

"ఒ.కే. మళ్ళీ మనం సోమవారం సాయంత్రం కలుద్దాం సౌరభ్" చిరునవ్వుతో చెప్పి, బ్యాగు తీసుకుని లిఫ్ట్ వైపు నడిచింది.

ఆమెకు వీడ్కోలు చెప్పి తలుపు గడియ వేసేసి తన పడకగది, హాలు, వంటిల్లు క్రితంసారి అమ్మ వచ్చినప్పుడు ఎలా సర్ది వెళ్ళిందో అలా మార్చాడు సౌరభ్.

'అమ్మకు టి.వి. మీద ఫోటోలు పెట్టడం నచ్చదు అనుకుంటూ కార్నర్‌లో వున్న షెల్ఫ్‌లో వున్న బొమ్మలు తీసేసి ఫోటోలు అక్కడ పెట్టాడు.

వంటింట్లో గూళ్ళలో వున్న డబ్బాలన్నీ ఆవిడకిష్టమైనట్టు సైజుల వారీగా సర్దాడు.

బెడ్‌రూములోకి వెళ్ళి రెండు మంచాలనూ కలిపి వాటిమీద పరచివున్న గళ్ళగళ్ళ డబుల్ బెడ్‌షీటు తీసేసి, మంచాలను గదిలో ఆమూలకొకటి ఈ మూలకొకటి జరిపి, ఆవిడకు నచ్చే గులాబిరంగు పువ్వుల సింగిల్ బెడ్ షీటు పరిచాడు.

ఇలా ఒక గంటసేపు అమ్మ ఎలా సర్దిపెట్టిందో గుర్తు చేసుకుని అన్నీ ఆ రకంగా అమర్చి అలసిపోయి వచ్చి మంచం మీద వాలాడు.

అతని ఆలోచనలు శర్మద మీదకి మళ్ళాయి. 'తన స్నేహితురాలి ఇంటికి చేరగానే ఫోను చేసి చెప్తానంది. ఇంకా దారిలోనే వుందా? ట్రాఫిక్ ఎక్కువగా వుందో ఏమో!' అనుకుంటూ గోడనున్న గడియారం కేసి చూసాడు.

అప్పుడే అతని సెల్ మోగింది. శర్మద పేరు చూడగానే తేలికగా నిట్టూర్చి ఫోను తీసి గ్రీన్ బటన్ నొక్కాడు. "ఇప్పుడే అనుకుంటున్నాను. ఇంకా చేరలేదా? ట్రాఫిక్

ఎక్కువగా వుందా అని" అన్నాడు. అతని గొంతులో ధ్వనించిన నిశ్చింత ఆమె పెదవుల మీద నవ్వును తెచ్చింది.

"అన్నీ మీ అమ్మ పద్ధతిలో సర్ది పెట్టడం అయిందా? అలసి పోయారా?" నవ్వును దాచుకుంటూ అడిగింది.

"ఏం చేద్దాం? నెలకు రెండు సార్లు ఈ నాటకం తప్పడం లేదు." తనూ నవ్వుతూ అన్నాడు సౌరభ్.

"సరే.... గుడ్ నైట్... రెండ్రోజులు ఇంచక్కా అమ్మ చేసి పెట్టే ఆలు బోండాలు, రవ్వ పకోడీలు తిని ఎంజాయ్ చెయ్యండి." అంటూ ఫోన్ కట్ చేసింది శర్మద.

శర్మదలో అతనికి నచ్చే గుణం అదే. తన అభిరుచులు, ఇష్టాఇష్టాలు వేరయినా ఇంకొకరిని తప్పు పట్టదు. అసలు ఎవ్వరి గురించీ తను చెడుగా మాట్లాడ్డం అతను వినలేదు.

మర్నాడు మారుతీజెన్ డ్రైవ్ చేస్తూ అమ్మ కిష్టమైన సి.డి.ని పెట్టాడు. నారాయణి కారెక్కి కొడుకు పక్కన సీట్లో కూర్చోగానే భానుమతి గొంతులో నుండి జాలువారిన తీయని పాట "మనసు తెలిసిన మేఘమాలా నా మనసు బావకు చెప్పి రావా?" అంటూ ఆవిడ చెవులకు విందు చేసింది.

"నిజంగా చెప్తున్నానురా... అక్కడున్న పది రోజులు ఏదో జైల్లో వున్నట్టు వుంటుంది. ఇక్కడకు నీ దగ్గరికి రాగానే ' హమ్మయ్య మనింటికి మనం చేరుకున్నాం' అనిపించి మనసు నెమ్మదిస్తుంది. అవేమి పాటలో ఒకటే గుండె పగిలేలా ఆ పాప్‌లు, ర్యాప్‌లు.... లేదా పిచ్చిగంతుల హిందీ సినిమా పాటలు." విశ్రాంతిగా సీటు మీద వెనక్కి వాలుతూ అందామె.

ఇంటికి రాగానే అన్ని గదులూ తిరిగి తృప్తిగా తల పంకించింది. 'ఎంతైనా చిన్నకొడుకుకు అమ్మపోలికే కాదు అమ్మ అభిరుచులూ వచ్చాయి' అనుకుంటూ.

"ఈ ఇంటివాళ్ళు ఆ గది అలా తాళం పెట్టే వుంచుతారేమిట్రా? ఆ సామాన్లేవో తీసుకెళ్ళి ఆ గదీ నీకే ఇచ్చేయవచ్చును కదా" అన్నదావిడ తాళం వేసివున్న రెండో బెడ్‌రూమును చూసి.

"పోనీ లేమ్మా! ఆ మేరకు అద్దె తగ్గుతున్నది కదా మనకు..." అనేసాడు సౌరభ్.

సౌరభ్ పడకగదిని ఆనుకుని వున్న నీళ్ళ గదిలో గీజర్ ఆన్ చేసి, బక్కెట్టు నిండా వేడినీళ్ళు పట్టి పెట్టాడు. "అమ్మా హాయిగా వేడినీళ్ళు పోసుకుంటే రైలు ప్రయాణం అలసటంతా తీరిపోతుంది" అంటూ.

"పెళ్ళానికి కావాలంటే నీళ్ళు పెడతాడు కాళ్ళూ పడతాడు మీ అన్న సచిన్. గానీ అమ్మ గురించి ఏమీ పట్టించుకోడు. నేనేదన్నా చెప్పబోతే 'అవన్నీ నాకు తెలియదమ్మా మాలినికి చెప్పు చూస్తుంది' అనేస్తాడు. ఆపిల్ల మాట్లాడితే నోటి ముత్యాలు రాలిపోతా యన్నట్టు 'ఆ...ఊ' అంటుంది తప్ప మనసు విప్పి మాట్లాడదు. రాగానే అమ్మ కోసం

వేడి నీళ్ళు పెట్టావు... కాఫీ కలిపి ఇచ్చావు.. నీ దగ్గర వున్న స్వతంత్రం నాకు వాళ్ళింట్లో లేదు సౌరభ్" అంటూ స్నానానికి వెళ్ళింది నారాయణి.

స్నానం ముగించాక విడిచిన బట్టల్ని వేడి నీళ్ళలో పిండి ఆరేయడానికి బాల్కనీలోకి వచ్చిన ఆవిడ కళ్ళకు కుండీలో పచ్చగా నవనవలాడుతున్న ఆకులతో వున్న తులసి మొక్క కనబడింది.

"ఈ తులసి మొక్క ఎప్పుడు వేసావురా?" అంది మురిపెంగా చూస్తూ.

సౌరభ్‌కు ఏం చెప్పాలో తెలీలేదు. ఇంట్లో తులసి మొక్క వుండడం ఆరోగ్యం అంటూ శర్మద తెచ్చి పెట్టిందా మొక్క.

"ఎప్పుడో నెలకోసారి వచ్చే అమ్మకోసం గుర్తుగా తులసి మొక్క తెచ్చి పెట్టావు చూడు. అదీ ప్రేమ అంటే.. విజయవాడకు వెళ్ళినప్పుడల్లా చెప్తాను ఒరే ఆ బాల్కనీలో బట్టలు ఆరేసుకోవడానికి ఇంకో రెండు తాళ్ళు కట్టు... నా చీరెలు ఆరేసుకోడానికి అని. వాడికి జ్ఞాపకం వుండదో, పెళ్ళానికి నచ్చదని చేయడో గానీ ఇంత దాకా కట్టలేదు! వాషింగు మెషిన్, డ్రయర్ వుంది కదమ్మా' అంటాడు. నాకు చీరలు ముడతలు పడకుండా చక్కగా ఆరేసుకుని కట్టుకోవడం అలవాటని వాడికి తెలీదూ? బాల్కనీలో నుండి బట్టలు వీధిలోకి కనబడితే అసహ్యంగా వుంటుందిట... అది వాడి భార్యమాట... అందుకే అన్నారు పెళ్ళాం బెల్లమూ, తల్లి అల్లమూ అని" అనేసి టిఫిన్ చేయడం మొదలు పెట్టిందామె.

చిన్నగా వుండే ఉల్లిపాయలు కంది పప్పులో వేసి వుడికించి ఘుమఘుమ లాడే మద్రాసు సాంబారు చేసింది. ఇన్‌స్టెంటు రవ్వ ఇడ్లీ మిక్స్‌ను పెరుగులో కలిపి ఇడ్లీలు చేసి మరొకటి వేసుకో అంటూ కొసరి కొసరి తినిపించింది కొడుకుచేత.

మధ్యాహ్నం భోజనంలోకి ఆంధ్రావాళ్ళ గోంగూర పచ్చడి, బెంగుళూరి 'బిసిబేళెహుళి' కేరళవాళ్ళ అవియల్ చేసింది. నేతి వాసనలతో ఇల్లు ఘుమఘుమలాడింది.

భోజనాలు అయ్యాక శర్మదకు ఫోను చేసాడు సౌరబ్ "అమ్మ వంట నువ్వు మిస్ అవుతున్నావు" అన్నాడు.

"మిగిలితే ఫ్రిజ్‌లో పెట్టు రుచి చూస్తాను" అంది నవ్వుతూ. "అమ్మకేమీ ఇబ్బంది లేకుండా కావల్సిన వస్తువులన్నీ వున్నాయి కదా?" అనడిగి ఫోను పెట్టేసింది. ఇంట్లోకి కావల్సిన వస్తువులన్నీ శర్మదే తెస్తుంది.

సాయంత్రం కాఫీ త్రాగేక "అమ్మా బయటకు వెడదాం రెడీ అవ్వు... నీకో సర్‌ప్రైజ్..." అన్నాడు సౌరభ్.

గచ్చి బౌలీ ఏరియాకు తీసికెళ్ళి అక్కడ తను కొన్న ప్లాటు చూపించాడు.

"పైన రెండు పడకగదులు, క్రిందో పడకగది వుండేట్లు డూప్లెక్స్ ఇల్లు కట్టుకోవచ్చు. నువ్వూ నాన్నా కూడా ఇక్కడికే వచ్చేసి వుండి పోవాలి.." అన్నాడు ఆశ్చర్యంగా చూస్తున్న తల్లితో.

నారాయణి ఎందుకో మౌనంగా వుండి పోయింది. ఇంటికి వచ్చాక సౌరభ్ అడిగాడు "నీకు సంతోషంగా లేదామ్మా? ఇంకో రెండు నెలలలో రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. నువ్వూ, నాన్న వచ్చి భూమి పూజ చేసి ఇల్లు మొదలు పెట్టి వెళ్ళాలి" అన్నాడు.

"నీకు తెలుసా సచిన్ కూడ విజయవాడలో రెండు ప్లాట్లు కొన్నాడు. రెండూ భార్య పేరుమీదనే... కోడలు వాళ్ళ అమ్మగారు చెప్పేంత వరకు మాకసలు తెలియదు. పిల్లలు వృద్ధిలోకి వస్తే సంతోష పడతాంగానీ దిష్టి పెట్టం కదా! " అంది నారాయణి నిట్టూరుస్తూ.

సౌరభ్‌కి ఏం మాట్లాడాలో తోచలేదు.

"ఎందుకో అన్ని విషయాల్లో దాపరికం ఎక్కువ. మాలినికి షాపింగుకు వెళ్ళి పెద్ద బ్యాగుల నిండా బట్టలు, వస్తువులు తెచ్చుకుంటుందా... తిన్నగా తన గదిలోకి వెళ్ళి దాచుకుంటుంది తప్ప 'ఇదిగో ఇవి కొన్నాను అత్తయ్యా' అని చూపించదు. నగలూ అంతే... "ఈ గాజులు కొత్తగా చేయించావా" అని నేనడిగితే "అమ్మ చేయించింది" అంటుంది. వాళ్ళ అమ్మా వాళ్ళు ఎంత స్థితిమంతులో మాకు తెలియదా? 'మీ అబ్బాయి చేయించారు' అని ఎప్పుడూ అనదు." అసంతృప్తిగా తల పంకిస్తూ అంది నారాయణి.

తమ చిన్నతనంలో నాన్నమ్మ ఊరునుండి వస్తే అమ్మ తన చేతుల్లోవి, మెడలోవి కొత్త వస్తువులు తీసి దాచేయడం సౌరభ్‌కి గుర్తుంది. అత్తాకోడళ్ళ మధ్య ఇటువంటిబేధాలు తరాలైనా మారవేమో అనుకున్నాడు సౌరభ్.

ఆదివారంనాడు అమ్మను షాప్‌కు తీసికెళ్ళి మంచిచీర కొన్నాడతను. ఆమె కిష్టమైన ఐస్‌క్రీమ్ హోమ్ ప్యాక్ తెచ్చాడు. ఇంటి కొచ్చాక తింటున్నప్పుడు చిన్నగా నవ్వుతూ అంది నారాయణి. "నీ దగ్గరకు వస్తే చిన్న పిల్లనై పోతాను. నీదగ్గర ఆచనువు, స్వతంత్రం వున్నట్టనిపిస్తుంది. పెళ్ళయ్యాక సచిన్ నాకొడుకుగా కాక మాలిని భర్తగానే కనిపిస్తాడెందుకో.." అంది. ఆమె గొంతులో దిగులు ధ్వనించింది.

మగవాడికి తల్లి, భార్య ఇద్దరూ కావాలని ఎందుకు గ్రహించరు ఈ ఆడవాళ్ళు? తను నవమాసాలు మోసి, కనిపెంచిన కొడుకును కోడలొచ్చి దూరం చేసిందని తల్లి అనుకుంటుంది. తన భర్త ప్రేమ, సంపాదన, సర్వస్వం తనకే చెందాలని అతని మీద అత్తగారి అధిపత్యం తగ్గించి తన వైపు తిప్పుకోవాలని భార్య ప్రయత్నిస్తుంది. మధ్యలో నలిగిపోయేది మగవాడే. ఈ అభద్రతా భావం తల్లికీ, భార్యకూ, కలగకుండా నడుచుకోవడం కత్తిమీద సాము లాంటిదేనేమో' అనుకున్నాడు సౌరభ్.

సోమవారం ఉదయం సౌరభ్ తొందరగా ఆఫీసుకు వెళ్ళాల్సి రావడంతో తను ఒంటరిగా వెళ్ళగలనని ధైర్యం చెప్పి పంపింది నారాయణి.

ఆవిడ ఇల్లు తాళం వేసి కిటికీలో నుండి లోపలికి విసిరేసి లిఫ్ట్ వైపు నడుస్తుండగా ఎదురు పడింది అదే అంతస్తులో మరో అపార్ట్‌మెంట్‌లో వుంటున్న నడివయసు స్త్రీ.

"మీరు అప్పుడే ఊరికి వెడుతున్నారా?" అంది నారాయణి చేతిలోని బ్యాగు చూసి. "సంవత్సర కాలంగా చూస్తున్నాను. మీరు రావడానికి ముందు మీ కోడలు వెళ్ళిపోతుంది. మళ్ళీ మీరు వెళ్ళగానే వస్తుంది. అలాగే ఆపిల్ల తరుపువాళ్ళు వస్తారంటే మీఅబ్బాయి ఇంట్లో వుండకుండా వెళ్ళిపోతాడు. పెద్దవాళ్ళకు తెలియకుండా పెళ్ళి చేసుకున్నారా లేక పెళ్ళి కాకుండానే..." అంటూ అర్థోక్తిలో ఆగిపోయిందావిడ.

నారాయణికి నోట మాటరాలేదు. ఆవిడ వెళ్ళిపోయాక గానీ ఆమె మాటలు అర్థం కాలేదు. 'ఏం జరుగుతోందిక్కడ? తమకు తెలియకుండానే సౌరభ్ పెళ్ళిచేసుకుని కాపురం పెట్టాడా? లేక కొత్తగా వింటున్న 'లివ్-ఇన్-రిలేషన్‌షిప్'తో ఎవరైనా అమ్మాయితో కలిసి వుంటున్నాడా? అందుకే తన పెళ్ళి ప్రయత్నాలన్నీ తిప్పికొడుతున్నాడా?' ప్రయాణం మానుకుని సాయంకాలం సౌరభ్ వచ్చాక నిలదీసి అడగడమా, ఊరికి వెళ్ళి భర్తనూ తీసుకొచ్చి ఏ విషయం తేల్చడమా తోచక రెండు నిముషాలు అలా నిలబడి పోయింది. పరిస్థితి ఏదైనా వాడి నాన్నగారికే చెప్పుకోనీ అనిపించి ధైర్యం కూడదీసుకుని క్రిందికి వచ్చి బస్ స్టేషన్‌కి బయల్దేరింది నారాయణి.

ఎంత నిబ్బరంగా వుండాలనుకున్నా దారి పొడువునా ఏవేవో ఆలోచనలు ఆమెను స్థిమితంగా వుండనీయడం లేదు.

ఒకరకంగా ఈ పరిస్థితికి తనే కారణమా? పెళ్ళికాగానే పెద్దకొడుకు తనకు దూరమై పోయాడనీ, కోడలు తనని ఇంటి మనిషిలా కాక అతిథి వలె చూస్తుందనీ సౌరభ్‌తో చెప్పుకుని బాధపడడం వలనే అతను ఈ దారి ఎన్నుకున్నాడా? అనుకుంటూ నీరస పడిపోయింది.

ఎప్పుడూ చిన్న కొడుకు దగ్గర వుండి వచ్చేటప్పుడు కలకలలాడుతూ ఆనందంగా వుండే భార్య నాలుగు లంఖణాలు చేసినట్టు వ్రేలాడి పోతూ ఇల్లు చేరడం చూసి కంగారు పడ్డాడు ఆమె భర్త నరసింహం.

విషయం తెలిసాక ఆయన కూడా ఆలోచనలో పడ్డాడు. 'ముప్పై మూడేళ్ళు దాటినా సౌరభ్ పెళ్ళి వద్దనడం ఇందుకేనా?'

రెండు వారాల తరువాత ఒక సెలవు రోజున సౌరభ్‌కి ముందుగా చెప్పకుండా అతని ఇంటికి వెళ్ళారు నరసింహం, నారాయణి.

తలుపులు దగ్గరగా వేసి వుండటంతో చప్పుడు కాకుండా లోపలికి వచ్చారు.

ఏదో పాట కూనిరాగం తీస్తూ వంటింట్లో టిఫిన్ తయారు చేస్తోంది శర్మద. ఆమె సాధారణంగా ఇంట్లో వేసుకునే గౌనులోనే వుంది. ఎప్పుడూ తాళం పెట్టి కనబడే ఇంటివాళ్ళ గది తెరచి వుంది. మంచంమీద ఆపిల్ల చీరెలున్నాయి. "సౌరభ్ ఏడమ్మా?" అంటూ నారాయణి వంటింట్లోకి వచ్చి పలకరించే సరికి బిత్తరపోయింది శర్మద.

ఆవిడను చూడగానే సౌరభ్ తల్లిగా గుర్తించింది అంతలో సర్దుకుని "స్నానం చేస్తున్నాడు ఆంటీ... అలసి పోయి వుంటారు ప్రయాణంలో కూర్చోండి అంకుల్"

మంచినీళ్ళు అందిస్తూ మర్యాద చేసింది.

సౌరభ్ స్నానం ముగించి వచ్చేలోపుగా వాళ్ళకు కాఫీ కలిపి ఇచ్చింది.

నారాయణి, నరసింహం నోట మాట రానట్టు కూర్చున్నారు. సౌరభ్ స్నానం ముగించి పైజామా లాల్చీ వేసుకుని హాల్లోకి రాగానే ఎదురుగా కనబడిన అమ్మా నాన్నలను చూసి కంగారు పడ్డాడు. అంతలో సర్దుకుని "అదేమిటమ్మా ఫోను చేయలేదేం వస్తున్నట్టు? బస్ స్టాండుకు కారు తీసుకు వచ్చే వాడినిగా!" అన్నాడు ఏమీ జరగనట్టు.

"అంతకు ముందే ఆ అమ్మాయిని పంపించేసే వాడివి కూడా!" అంది నారాయణి సౌరభ్ కళ్ళలోకి సూటిగా చూస్తూ.

"ఏమిట్రా ఇది? మాకు చెప్పకుండా పెళ్ళి చేసుకున్నావా? లేక ఈ మధ్యలో ఫాషన్‌గా మారిన "సహజీవనం" ప్రారంభించారా?" శషబిషలు లేకుండా తిన్నగా పాయింట్‌లోకి వచ్చి ప్రశ్నించాడు నరసింహం.

"ప్లీజ్ నాన్నా.. మరీ అంత ఊహించకండి. అమ్మా! నీకు తెలియకుండా నేను అంత పని చేయగలనా? నేను శర్మదా దగ్గరలోని హైటెక్ సిటీలో పని చేస్తున్నాం. ఇల్లు దగ్గరగా కావాలని చూసాము. మమ్మల్ని ఇది వరకు రెండు సార్లు అమెరికా పంపినప్పుడు కంపెనీ వాళ్ళు ఇలాగే ఒక అపార్ట్‌మెంట్‌లో గదులు ఇచ్చారు. ఈ ఇంటికి అద్దె ఇరవైనాలుగువేలు. ఒక్కరికి అంత పెట్టడం దండగ అనిపించింది. మాకు అప్పుడప్పుడు రాత్రి కూడ కంపెనీకి వెళ్ళాల్సి వుంటుంది. అమెరికన్ కంపెనీ కద అప్పుడు వాళ్ళకు పగలు దగ్గరగా వుండాలి. అంత అద్దె భారం వద్దు అనుకుని ఈ ఒప్పందానికి వచ్చాం. మేము కేవలం కొలీగ్స్. కొంత వరకు స్నేహితులం. అపార్ట్‌మెంటు షేర్ చేస్తున్నాం అంతే" తను కూడా అంతే సూటిగా సమాధానమిచ్చాడు సౌరభ్.

"ఒరేయ్ మీ వదిన గురించి నీతో చెప్పుకుంటున్నానని పెళ్ళే వద్దనుకుని ఈరకంగా వుండిపోవాలనుకున్నా వేమోనని ఎంత బాధ పడ్డాను తెలుసా? మీరు సంతోషంగా, సుఖంగా వుండడమే నాన్నా మాకు కావల్సింది. ఏదో పెద్దవాళ్ళం కొన్నిటికి సర్దుకోలేక బాధ పడినా ఎప్పుడూ మీ శ్రేయస్సునే కోరుకుంటాం." గద్గద కంఠంతో అన్నది నారాయణి.

"అమ్మాయి చక్కగా ఒద్దికగా వుంది. చదువు సంస్కారం వున్నాయి. ఇద్దరి అభిరుచులు కలిసినట్టే వున్నాయి. మామాట విని కేవలం అపార్ట్‌మెంటు షేర్ చేసుకోవడం కాకుండా జీవితాలనూ పంచుకోండి" అన్నాడు నరసింహం.

"ఏమ్మా నీకు అభ్యంతరం లేదు కదూ?" శర్మద భుజం చుట్టూ చేయివేసి అడిగింది నారాయణి.

శర్మద, సౌరభ్ అనుకోని ఈ శుభ పరిణామంతో వుక్కిరి బిక్కిరి అయిపోయినా ఒకరి నొకరు చూసుకుని అంగీకారంగా చిరునవ్వులు చిందించారు.

– గృహశోభ జూన్ 2011